సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు శోభన్, కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు

గచ్చిబౌలి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు శోభన్, సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రతినెలా జీతాలు సకాలంలో వచ్చే విధంగా చూడాలని కోరారు. హైదరాబాద్‌లాంటి మహానగరంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10వేలు అద్దె కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అద్దెలను పెంచే విధంగా చూడాలని వారు కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు డబుల్ ఇళ్లు కేటాయించేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు నాగమణి, శ్రీలత,టీచర్లు లక్ష్మీ, ప్రవీణ, లక్ష్మీకాంతం, జ్యోతి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ.. నేచర్ వాక్


థియేటర్‌లో కార్పొరేట్ ఉద్యోగులు


బర్డ్స్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీతో కార్పొరేటర్ ఉద్యోగులు ఎంజాయ్ చేశారు. అడవిలో వెళ్తున్నట్లు, క్రూర మృగాలు సమీపంలో తిరగడం, పాములు, అరుదైన పక్షులు ఎగురుతున్న అనుభూతిని పొందారు. మంగళవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌కు డీబీఎస్ టెక్ కార్పొరేట్ సంస్థ ఉద్యోగులు బర్డ్స్ వాక్ కోసం వచ్చారు. బర్డ్స్ వాక్‌ను ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ జెండా ఊపి ప్రారంభించారు. ముఖీ పిట్ట, మగ నెమలి, నల్ల యోట్రింత, లొట్ట కన్ను పిట్ట తదితర 17 రకాల పక్షులను సందర్శించారు. నేచర్ వాక్‌లో బొటానికల్ గార్డెన్ విశేషాలను హెడ్ నేచరిస్టులు అఖిల్, మనోజ్‌లు వివరించారు. 75 థీమ్ పార్క్‌లను బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్ వివరించారు. అనంతరం బస్సులో తిరుగుతూ హెడ్ సెట్‌ల ద్వారా వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ అనుభూతిని కల్పించారు. రెండు 3డి థియేటర్లలో సముద్రంలోకి దిగిన, అంతరిక్షంలో విహరించిన అనుభూతి కల్పించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి బర్డ్స్ వాక్ నిర్వహిస్తామని టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు.

అపరిశుభ్రత.. రెస్టారెంట్‌కు రూ.50వేలు జరిమానా


లక్కీ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి తదితరులు

మియాపూర్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని చందానగర్ సర్కిల్- 21 ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఏఎంఓహెచ్ రవి, పారిశుద్ధ్య అధికారులతో కలిసి మంగళవారం ఉదయం ఆయన పర్యటించారు. మియాపూర్‌లోని పలు రెస్టారెంట్‌లను తనిఖీ చేశారు. మియాపూర్‌లో లక్కీ రెస్టారెంట్‌లో శుభ్రత పాటించకపోవడంతో పాటు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడంతో రూ.50వేలు జరిమానా విధించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మరలా అపరిశుభ్రంగా కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీ, బస్తీల ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త ఆటో రిక్షావారికే అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి రామకృష్ణారెడ్డి, పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం


యశోద ఆస్పత్రి వద్ద రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని హైటెక్ ఫుడ్ కోర్టు నుంచి యశోద హాస్పిటల్ వరకు , భారత్ పెట్రోల్ పంపు నుంచి హైటెక్ సిటీ ఫ్లైఓవర్ వరకు రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న సర్వీస్ రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని సర్వీస్ రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం జరిగిందన్నారు.కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శర్మ, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

జర్నలిజంలో ఖచ్చితత్వం, సమగ్రత అవసరం

ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ అధ్యక్షుడు ప్రొ.సతీష్‌కుమార్‌రాయ్

రాయదుర్గం: జర్నలిజాన్ని పవిత్రమైన బాధ్యతగా మహాత్మాగాంధీ భావించేవారని ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సతీష్ కుమార్‌రాయ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ ఆధ్వర్యంలో 'జర్నలిజమ్ ఆఫ్ మహాత్మాగాంధీ'అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజంలో ఖచ్చితత్వం, సమగ్రతకు కట్టుబడి ఉండాలని తోటి జర్నలిస్టులను గాంధీ కోరేవారని అన్నారు. ప్రస్తుత మీడియా సవాళ్లకు ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు గాంధీ ఆశయాలను ఎలా అన్వయించవచ్చో పరిశీలించాలని ఆయన జర్నలిజమ్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మనూ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టైగ్రాడ్ ప్లస్ రీజినల్ ఫైనల్స్-2024 విజేతలు వీరే..


అతిథుల నుంచి లక్ష నగదు అందుకుంటున్న గ్రీన్ ఫ్యూజన్ స్టార్టప్ ప్రతినిధులు

గ్రీన్ ఫ్యూజన్, జీ-ఐ, రెడ్‌స్ట్రింగ్ జట్లు

రాయదుర్గం: 'టై'గ్రాడ్ ప్లస్ రీజినల్ ఫైనల్స్-2024 విజేతలను మంగళవారం ప్రకటించారు. స్టార్టప్‌లలో అత్యుత్తమమైన వాటికి నగదు పురస్కారాలను అందించారు. ఈ పోటీలో పన్నెండు జట్లు పాల్గొన్నాయి. ఎస్కీ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను ఎంపిక చేశారు. భీమవరంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పరిశ్రమల కోసం ఎనర్జీ మానిటరింగ్ స్టార్టప్ అయిన 'గ్రీన్ ఫ్యూజన్' స్టార్టప్ విజేతగా నిలిచింది. లక్ష రూపాయల ప్రైజ్ మనీని స్టార్టప్ నిర్వాహకులకు అందించారు. నగరంలోని జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ నుంచి ఒక కాంపాక్ట్, సరసమైన కంటి పరీక్ష పరికరం జీ-ఐ స్టార్టప్ మొదటి రన్నరప్‌గా నిలిచి రూ.50వేలు అందుకుంది. అదేవిధంగా 'రెడ్ స్ట్రింగ్'ను రూపొందించిన గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి రెండవ రన్నరప్‌గా నిలిచి రూ.20వేల నగదు అందుకుంది. కార్యక్రమంలో టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, టై హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీని చందుపట్ల, టైగ్రాడ్ కమిటీ ప్రతినిధి భానుప్రకాశ్, టై గ్రాడ్ కమిటీ కో చైర్‌పర్సన్ డాక్టర్ నందితాసేథి ప్రసంగించారు.





మార్కెట్లలో

దీపావళి సందడి



దీపావళి సందర్భంగా మార్కెట్లలో కొనుగోళ్ల సందడి నెలకొన్నది. ప్రమిదలు, గృహాలంకరణ వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి. దీపావళి అంటేనే బోలెడంత సందడి మోసుకొచ్చే పండగ. చిన్నారులు, యువత టపాసులు పేల్చుతూ చేసే హంగామా అంతాఇంతాకాదు. ఇక పండగకు ఇంటిని, వ్యాపార సముదాయాలను అలంకరించేందుకు పూలు మార్కెట్లను ముంచెత్తుతాయి. శేరిలింగంపల్లిలోని తారానగర్, నల్లగండ్ల, లింగంపల్లి మార్కెట్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రకరకాల మట్టి ప్రమిదలు, బొమ్మలు, పూజా సామగ్రిని సిద్ధం చేశారు. బుధ, గురువారాల్లో విక్రయాలు పెరుగుతాయని వ్యాపారులు అంటున్నారు. బట్టల షాపులు, స్వీట్‌హౌస్‌లు ఇప్పటికే రద్దీగా మారాయి.

– శేరిలింగంపల్లి











టాప్ స్కాలర్‌గా హెచ్‌సీయూ ప్రొఫెసర్

ఫిజికల్ సైన్సెస్‌లో అశ్వినిన్‌నాంగియాకు అరుదైన గుర్తింపు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అశ్వినిన్‌నాంగియాకు అరుదైన గుర్తింపు లభించింది. స్కాలర్ జీపీఎస్ టాప్ స్కాలర్‌లలో ఒకరుగా గుర్తింపు సాధించారు.హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్ అశ్వినిన్ నాంగియా 'ఫిజికల్ సైన్సెస్ అండ్ మ్యాథమెటిక్స్' విభాగంలో విశేష గుర్తింపు పొందారు. స్కాలర్ జీపీఎస్ అనేది కాలిఫోర్నియాలోని ఓ అమెరికన్ కంపెనీ మెటా ఎనలిటిక్స్ యాజమాన్యంచే నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

అయ్యప్పస్వామికి పాలాభిషేకం



చందానగర్: చందానగర్ గంగారంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రం అయిన ఉత్తర నక్షత్రం మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవాలయ ప్రాంగణం'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో మారుమ్రోగింది. ప్రధాన అర్చకులు కమలాకర్ శర్మ, ప్రసాదరావు గురుస్వాములు అయ్యప్ప స్వామికి పాలాభిషేకం, నెయ్యి, గంధం, పువ్వులతో అభిషేకాలు చేశారు.

టీఎన్‌జీఓ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం: టీఎన్‌జీఓ రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఎంప్లాయిస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రాన్ని సమర్పించారు. మంగళవారం ఆయన నివాసంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం జంగయ్య, ప్రధాన కార్యదర్శి కె జోసఫ్, సభ్యుడు గోపాలచారి తదితరులు మంగళవారం కలిసి కాలనీ సమస్యలను వివరించారు. కాలనీలో దాదాపు 500 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకుని రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చేస్తున్నారని చెప్పారు. దాదాపు 60 ఏళ్ళు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులే అధికంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.



బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలి


ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

మాదాపూర్: ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 40 సెకన్లకు ఒకరు స్ట్రోక్ బారినపడుతున్నారని న్యూరాలజీ డాక్టర్ హరిరాధాకృష్ణ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంవత్సరానికొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలని సూచించారు. స్ట్రోక్ అనేది తెలియకుండానే కుంగదీస్తుందని చెప్పారు. బ్రెయిన్‌స్ట్రోక్ ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని వికలాంగుడిగా మారుస్తుందని, కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవిస్తుందన్నారు. భారతదేశంలో వార్షికంగా 1.66 మిలియన్ల కొత్త కేసులు నమోదు అవుతున్నాయన్నారు. కాగా ఈనెల 30 నుంచి 10వ తేదీ వరకు ఉచిత కన్సల్టేషన్ కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం డాక్టర్లు డాక్టర్ రంజిత్, డాక్టర్ విక్రమ్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ అభిషేక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టాస్కులు, కమీషన్ పేరుతో సైబర్ మోసం

లక్షా నలభై ఎనిమిది వేలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.1,48,000 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం కట్ట పోచారం గ్రామానికి చెందిన వ్యక్తికి టాస్క్‌లు, కమీషన్ పేరుతో సెప్టెంబర్ 28న మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ వస్తుందని చెప్పి నమ్మించడంతో ఉద్యోగి పలుదఫాలుగా డబ్బు వేశాడు. పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రోడ్డుపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ కోరారు. మంగళవారం ఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రోడ్డును అభివృద్ధి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఈ రోడ్డుపై సమయపాలన లేకుండా భారీ వాహనాలు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. దీనికితోడు టిప్పర్‌లలో ప్రమాదకరంగా రాళ్ళు, మట్టి తీసుకుపోతున్నారని అధికారులు నియంత్రించాలని కోరారు.

మెగా జాబ్‌మేళా

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయంలో మంగళవారం మ్యాజిక్ బస్సు ఫౌండేషన్, మూసాపేట వీర్ సావర్కర్ సేవ సమితి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 కంపెనీలు పాల్గొన్నాయని, 466 మంది నిరుద్యోగులకు గాను 80 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పలు కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లేబర్ క్యాంప్ వద్ద ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సంజీత్‌కుమార్ జీవనోపాధి కోసం గత ఏడాది తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఆర్ లేబర్‌క్యాంప్ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తున్నాడు. అతనికి పశ్చిమ బెంగాల్‌కు చెందిన మనోజ్‌తో స్నేహం ఏర్పడింది. పలువురు గంజాయి అడుగుతున్నారని తనకు గంజాయి తెచ్చిస్తే అమ్ముకుంటానని మనోజ్‌కు చెప్పడంతో మనోజ్ కిలో గంజాయిని రూ.20వేలకు సంజీత్ కుమార్‌కు ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంజీత్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి కిలో గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్ -2 డిపో పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం వెంకటేశం తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్, బాచుపల్లి, మల్లంపేట్‌తో పాటు నిజాంపేట్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సుల సేవలకు సంబంధించి సమస్యలతో పాటు సూచనలు, సలహాలు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. ప్రయాణికులు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226420 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ పుష్పనగేష్ కోరారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని బాలవిహార్ పార్కులో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.50 లక్షల నిధులతో పార్కు సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్, పార్కు కమాన్, వాల్ పెయింటింగ్, యోగా ఏరియా, విద్యుత్ దీపాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని కోరారు.

ఆయుర్వేద వైద్యం శ్రేష్ఠం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి నారాయణమూర్తి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పన్నాడి రమేష్ మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యం శ్రేష్ఠమని పూర్వం ఆయుర్వేదానికి ఎంతో ప్రాధాన్యత ఉండేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో నరసింహ, సెక్రటరీ తాటిపాముల వెంకటేష్, సతీష్, వార్డు మెంబర్ కృష్ణ, మహేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ సౌత్‌జోన్ పోటీలకు మహిళా జట్టు ఎంపిక

కేపీహెచ్‌బీకాలనీ: సౌత్ జోన్‌లో జరగబోయే మహిళల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను జేఎన్‌టీయూహెచ్‌లో యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ అరుణకుమారి, డీఈ, చీఫ్ సెలక్టర్ డాక్టర్ సోమేశ్వర్, హ్యాండ్ బాల్ జాతీయ క్రీడాకారులు కుమార్ యాదవ్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సెలక్షన్‌లో వివిధ కళాశాలల నుంచి దాదాపు 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారు అలగప్ప యూనివర్సిటీ, చెన్నైలో నవంబర్ 20 నుంచి 25 వరకు జరిగే సౌత్‌జోన్ పోటీలలో ఆడనున్నారని స్పోర్ట్స్ సెక్రటరీ ఎన్ఎస్ దిలీప్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌వాసి పోల మనస్వినికి వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ 25 వేలు మంజూరుపత్రాలను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

పాఠశాలలో దీపావళి వేడుకలు



చందానగర్: చందానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, మేరు ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కలిసి మంగళవారం దీపావళి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య స్నేహభావం పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వైకుంఠపాళి ఆట, దీపావళి పండుగ అలంకరణలను రూపొందించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

బాణసంచా దుకాణంలో తనిఖీలు

మూసాపేట: మూసాపేటలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను మంగళవారం మూసాపేట సర్కిల్ ఏఎంహెచ్‌ఓ కార్తీక్ తనిఖీలు చేశారు. మూసాపేట, కైత్లాపూర్, సేవాలాల్‌నగర్‌లోని పలు షాపులలో లైసెన్స్, భద్రతను పరిశీలించారు. నాణ్యత లేని వాటిని స్వాధీనం చేసుకొని కైత్లాపూర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అవగాహన సదస్సు

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ కార్యాలయానికి వచ్చే కస్టమర్లతో మర్యాదగా మాట్లాడాలని విజిలెన్స్ అండ్ ఏపీడీఎస్ సీఐ శ్యామల వెంకటేష్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా మంగళవారం పటాన్‌చెరు విద్యుత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే కస్టమర్లతో మర్యాదగా మాట్లాడి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్, విజిలెన్స్ ఎస్ఐ వెంకట్ రాజు, నరేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌నగర్ హిందూ శ్మశానవాటికలో కార్పొరేటర్ సబిహా బేగం జీహెచ్ఎంసీ ఏఈ రంజిత్‌తో కలిసి రూ.78 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో శ్మశానవాటికలో బోర్‌వెల్, పూజగది, వాచ్‌మెన్ గది, బాత్‌రూం, అస్తికల గది, కట్టెల గది తదితరాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్.. ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 7 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన, ఒకరికి రెండు రోజులు జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రేపు రన్ ఫర్ యూనిటీ ర్యాలీ

కూకట్‌పల్లి: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈ నెల 31న నిజాంపేట్ పటేల్ విగ్రహం నుంచి కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వరకు రన్ ఫర్ యూనిటీ ఐక్యతా ర్యాలీ నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు తెలిపారు.